క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ప్రకాష్‌రాజును అభినందిస్తున్న ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా మాస్ మీడియా అధికారి (డెమో)గా ప్రకాష్‌రాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు వైద్య ఆరోగ్య శాఖలోని పీఓడీటీ విభాగంలో హెచ్ఈఓగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై కర్నూలు బదిలీ అయ్యారు. బాధ్యతలు తీసుకున్న ఆయన్ను ఇన్‌చార్జ్ డెమోగా పనిచేసిన శ్రీనివాసులు శెట్టి, రాముడు, మధుసూదన్ రావు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

ప్రజా పాటల రచయితలకు నివాళి



ఆర్‌పీ వాసు, నాగరాజు చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ప్రజా పాటల రచయితలు, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు ఆర్‌పీ వాసు, నాగరాజు వర్ధంతి సభను స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఎన్ఎం జిల్లా అధ్యక్షుడు బసవరాజు అధ్యక్షత వహించగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, పీఎన్ఎం నాయకులు ఎండీ ఆనంద్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి సేవలను స్మరించుకున్నారు. ఆర్‌పీ వాసు, నాగరాజు వర్ధంతిని పురస్కరించుకొని పాటకు పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా అభ్యుదయ రచయితలు జంధ్యాల రఘుబాబు, ఎలమర్తి రమణయ్య, డి.పార్వతలయ్యలను సన్మానించి మెమొంటోలను అందజేశారు.

జీవిత సాఫల్య పురస్కారం



స్వరూప్ సిన్హాకు పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ అధ్యాపకులు డాక్టర్ స్వరూప్ సిన్హాకు జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో జరిగిన కార్యక్రమంలో రాయలసీమ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెంకట బసవరావు, డీఎస్పీ మహబూబ్ బాషా, ప్రముఖ వైద్యులు శంకర శర్మ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేసీ కల్కూర, లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి లయన్ రాయపాటి శ్రీనివాస్, తదితరులు స్వరూప్‌సిన్హాకు జీవిత సాఫల్య పురస్కారంతో పాటు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, బెస్ట్ లాంగ్వేజ్ ఫెసిలిటేటర్ అవార్డులను అందజేశారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి



పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం సల్కాపురం, కె.మార్కాపురం, పర్ల, బస్తిపాడు, చిన్న టేకూరు, పెద్దటేకూరు గ్రామాల్లో రైతులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు రుణమాఫీతో పాటు పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు జరగనున్నాయని తెలిపారు. సీపీఐ నాయకులు రామాంజనేయులు, బడే సాహెబ్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే నీటి కొరత



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కల్లూరు: చెన్నరాయుని తిప్ప రిజర్వాయర్‌ను నీటితో నింపి 11 గ్రామాలకు సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఉలిందకొండలో మహేశ్వర్లు అధ్యక్షతన జరిగిన రైతు సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వాల వైఫల్యంతో సాగునీటి లభ్యత తగ్గిపోయిందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలని, గిట్టుబాటు ధర కల్పించాలని, యూరియా కొరతను తీర్చాలని కోరారు. సంఘం మండల కార్యదర్శి కృష్ణ, శేఖర్, సుధాకర్, విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కదల్లేక.. కన్నీటి వేదన

- చిన్నారులను వేధిస్తున్న సెరిబ్రల్ పాల్సీ
- పుట్టుకతోనే అంగవైకల్యం
- ప్రతి వెయ్యి మంది పిల్లల్లో ఐదుగురికి సమస్య
- ప్రసవ సమయంలో జాగ్రత్తలే శ్రీరామరక్ష
- నేడు వరల్డ్ సెరిబ్రల్ పాల్సీ అవగాహన దినం



కర్నూలు(హాస్పిటల్): పెళ్లైన జంటలకు తల్లిదండ్రులుగా మారాలని ఎంతో ఆశగా ఉంటుంది. జన్మించే బిడ్డ కోసం వారు ఆదుర్దాగా ఎదురుచూస్తారు. తీరా జన్మించాక ఆ బిడ్డ సరిగ్గా కదల్లేక జీవితాంతం ఇంకొకరిపై ఆధారపడి జీవించాల్సి వస్తుందని తెలిస్తే వారికి గుండెలు పగిలే వేదన మిగులుతుంది. ఇలా జన్మించిన పిల్లలను సెరిబ్రల్ పాల్సీ వచ్చిందని వైద్య పరిభాషలో చెబుతారు. ఇటీవల కాలంలో ప్రతి వెయ్యి మంది పిల్లల్లో ఐదుగురికి ఇలాంటి వారే జన్మిస్తున్నారు. ఈ నెల 6వ తేదీన వరల్డ్ సెరిబ్రల్ పాల్సీ అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం. జిల్లాలో సెరిబ్రల్ పాల్సీతో జన్మిస్తున్న పిల్లల సంఖ్య ప్రతి వెయ్యిలో ఐదుగురి దాకా ఉంటోంది. ముఖ్యంగా కొన్ని రకాల సామాజిక వర్గాలకు చెందిన పిల్లల్లో, నిరక్షరాస్యత అధికంగా ఉన్న కోసిగి, ఆలూరు, ఆస్పరి, కౌతాళం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, హాలహర్వి, డోన్, క్రిష్ణగిరి, తుగ్గలి, చిప్పగిరి, కోడుమూరు, గూడూరు వంటి ప్రాంతాల్లో ఇలాంటి పిల్లలు అధికంగా జన్మిస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. ఇతర పిల్లలతో పోల్చుకుంటే సెరిబ్రల్ పాల్సీ రుగ్మత ఉన్న పిల్లలు విభిన్నంగా ఉంటారు. వీరి ప్రవర్తన, పనితీరు, నడవడం, మాట్లాడటం, తినడం, రాయడం, కూర్చోవడం భిన్నంగా ఉంటాయి. వీరిలో కండరాలు బిగుసుకుపోవడం, కదలికలో లోపాలు ఉంటాయి. మెదడు శాశ్వతంగా దెబ్బతినడం వల్ల, అసాధారణమైన ఎదుగుదల వల్ల ఈ సమస్య వస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. మానవుడి శరీరానికి సంబంధించిన ప్రతి పనితీరును మెదడులోని సెరిబ్రమ్ అనే భాగం నిర్దేశిస్తుంది. నాలుగు నిమిషాల కన్నా ఎక్కువ సమయం మెదడుకు ఆక్సిజన్ అందకపోతే మెదడులోని నాడీవ్యవస్థ దెబ్బతింటుంది. ఇది శిశువుకు శాశ్వత అంగవైకల్యానికి దారి తీస్తుంది. అవసరమైన రక్త పరీక్షలు, క్రేనియల్ అల్ట్రాసౌండ్, మెదడుకు ఎంఆర్ఐ, సిటిస్కాన్ పరీక్షల ద్వారా ఈ వ్యాధిని నిర్ధారిస్తారు.

సెరిబ్రల్ పాల్సీలో రకాలు స్పాస్టిక్ సెరిబ్రల్ పాల్సీ

దాదాపు 70 శాతం మంది పిల్లలు ఈ రకానికి చెందిన వారే. ఈ రకం పిల్లల్లో కండరాలు బాగా బిగుసుకుపోతాయి. శరీర భాగాల పెరుగుదలలో లోపం ఉంటుంది. కండరాల సంకోచ, వ్యాకోచాల్లో తేడాలు ఉంటాయి. దీని కారణంగా కదలికలో ఇబ్బందిగా ఉంటుంది. కత్తెర కాలి నడక, మునివేళ్లపై నడవడం వీరిలో గమనిస్తాము.

ఎటాక్సిక్ సెరిబ్రల్ పాల్సీ

దాదాపుగా 10 శాతం పిల్లలు ఈ రకానికి చెందిన వారే. వీరిలో కండరాలు బలహీనంగా ఉంటాయి. కండరాల సమన్వయం లోపిస్తుంది. నడవడం, రాయడం వంటి పనుల్లో సమన్వయం లోపిస్తుంది.

సెరిబ్రల్ పాల్సీకి కారణాలు

- ప్రసవ సమయంలో కొందరు శిశువులకు మెదడుకు ఆక్సిజన్, రక్తసరఫరా/గ్లూకోజ్ సరఫరా జరగదు. ఇలాంటి వారికి మెదడు దెబ్బతిని సెరిబ్రల్ పాల్సీ వచ్చేందుకు అవకాశం ఉంది.
- ప్రసవ సమయంలో కలిగే ఇబ్బందులు, తల్లి గర్భంలో ఉమ్మునీటిలో గర్భస్థ శిశువు మూత్ర విసర్జన చేసి దానిని పీల్చడం వల్ల కూడా ఆ బిడ్డకు ఆక్సిజన్ అందదని వైద్యులు చెబుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో కూడా సెరిబ్రల్ పాల్సీ ఏర్పడుతుందంటున్నారు.
- నెలలు నిండకుండా జరిగే ప్రసవాల వల్ల కూడా ఈ వ్యాధి ముప్పు పొంచి ఉంది. కొందరు పిల్లలు పుట్టగానే ఏడవరు. దానిని పుట్టుకతో వచ్చిన ఆస్పిక్సియా అంటారు.
- కొంత మందికి పుట్టుకతో వచ్చే అనారోగ్య సమస్యల వల్ల మెదడుపై ప్రభావం చూపవచ్చు. బిడ్డ పుట్టగానే వచ్చే పచ్చ కామెర్లకు సరైన సమయంలో తగిన చికిత్స అందకపోయినా కూడా మెదడుపై ప్రభావం పడే అవకాశం ఉంది.
- కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు, మెనింజైటిస్, కొన్ని రకాల జన్యుకారణాల లాంటివి కూడా ఈ వ్యాధికి దారి తీయవచ్చు.

ఎథిటాయిడ్ సెరిబ్రల్ పాల్సీ

సెరిబ్రల్ పాల్సీతో జన్మించిన 10 శాతం మంది పిల్లల్లో ఈ రకం కనిపిస్తుంది. వీరిలో అవాంఛిత కదలికలు ఉంటాయి. కూర్చున్నప్పుడు, నిల్చున్నప్పుడు, రాస్తున్నప్పుడు అసాధారణ కదలికలు ఉంటాయి.

మిక్స్‌డ్ సెరిబ్రల్ పాల్సీ

ఇందులో పైన పేర్కొన్న అన్ని రకాల లక్షణాలు కనిపిస్తాయి.

చికిత్సతో పాటు థెరపీ ప్రధానం



సెరిబ్రల్ పాల్సీ రుగ్మత ఉన్న పిల్లలకు చికిత్సతో పాటు థెరపీలు ప్రధాన పాత్ర వహిస్తాయి. వారికి ప్రత్యేకంగా మందులు అంటూ ఏమీ ఉండవు. లక్షణాలు, వారికున్న ఇబ్బందులను బట్టి మందులు ఇస్తాం. అవసరమైన వారికి కొన్ని రకాలైన సర్జరీలు సూచిస్తాం. ముఖ్యంగా స్పీచ్ థెరపి, ఫిజియోథెరపి, రిహాబిటేషన్, వైద్యుల సలహాలతో మందులు తీసుకోవడం ముఖ్యం. వీరికి ప్రత్యేకంగా కొన్ని రకాల బూట్లు ధరించడం వల్ల కూడా నడకలో మార్పు రావచ్చు.

– డాక్టర్ కె.హేమంత్‌కుమార్, న్యూరాలజిస్టు, కర్నూలు

గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



గర్భంతో ఉన్న మహిళలు ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ప్రసవ సమయంలో గర్భంలోని శిశువు మూడున్నర కిలోల కంటే ఎక్కువ బరువున్నా ఇబ్బంది అవుతుంది. ఆ బిడ్డ బయటకు రావడానికి ఇబ్బంది ఏర్పడి మెదడుకు గాయమై సెరిబ్రల్ పాల్సీ వస్తుంది. బిడ్డ జన్మించాక కూడా పెరిగే క్రమంలో కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. వాటికి వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకుంటే ఇలాంటి వ్యాధులు రావు.

– డాక్టర్ విజయానందబాబు, హెచ్ఓడీ, చిన్నపిల్లల విభాగం, జీజీహెచ్, కర్నూలు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు (టౌన్): నగరంలోని సుంకేసుల రోడ్డులో నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలకలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్యకు నిర్ణీత గడువులోపు పరిష్కారం లభిస్తుందని, సమస్య పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు http://meekosam.ap,gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేటి నుంచి అంతర్రాష్ట్ర హోమ్ టీం కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండలంలోని కోయిలకొండ గ్రామంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుంచి అంతర్రాష్ట్ర హోమ్ టీం కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.2 వేలు అందిస్తామని చెప్పారు. అలాగే బెస్ట్ రైడర్, డిఫెండర్‌కు రూ.వెయ్యి చొప్పున అందస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు సోమవారం ఉదయం 9 గంటలలోపు రూ. 500 ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9493686207, 6300364569 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



సంఘీభావం తెలుపుతున్న బీసీ జేఏసీ నేతలు

కర్నూలు(అర్బన్): స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జేఏసీ నేతలు కోరారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో బీసీ జేఏసీ కన్వీనర్ దేవపూజ ధనుంజయ ఆచారి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు టీ.శేషఫణి, రాష్ట్ర వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మికాంతయ్య, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అయ్యన్న యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ కులాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో బీసీ కులాలకు చెందిన వారికి రాజకీయ లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. బీసీల హక్కులను సాధించుకునేందుకు ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. ఇతర కులాలను బీసీ జాబితాలో చేరిస్తే తీవ్రంగా వ్యతిరేకించడంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఆయా సంఘాల నాయకులు హేమంత్‌గౌడ్, రమేష్, విజయభాస్కర్ యాదవ్, షఫీఉల్లా, చంద్రికమ్మ, మల్లికార్జునయాదవ్, రాజశేఖర్, శ్రీనివాసులునాయుడు, ఉప్పర శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సర్దార్ నాగప్ప' పుస్తకావిష్కరణ



ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, రాజ్యాంగ పరిషత్ సభ్యుడు సర్దార్ నాగప్ప జీవిత గాథ 'సర్దార్ నాగప్ప' పుస్తకావిష్కరణ సోమవారం సాయంత్రం 5 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరుగుతుందని బహుజన విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య, అధ్యక్షుడు దాసరి రామశేషయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్యక్రమ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రముఖ చరిత్ర పరిశోధకులు, నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ నాగప్ప జీవిత గాథను గ్రంథస్థం చేశారన్నారు. ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. సర్దార్ నాగప్ప స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా భారత రాజ్యాంగ నిర్మాణంలో తన వంతు పాత్ర పోషించి తుది దాకా ప్రజా సేవలో ఉన్న గొప్ప మహనీయుడు అన్నారు. ఆయన జీవితం గురించి, ఉద్యమాల గురించి భావితరాలకు వివరించి స్ఫూర్తి నింపాల్సిన అవసరం ఉందన్నారు. వేదిక కార్యదర్శి పెరికల రంగస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ వర్మ, దామోదరం రాధాకృష్ణమూర్తి, రచయిత అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

11న మందకృష్ణ మాదిగ రాక

కర్నూలు(సెంట్రల్): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అక్టోబర్ 11వ తేదీన కర్నూలులో పర్యటించనున్నట్లు ఆ సంఘం నగర అధ్యక్షురాలు మీసాల సుమలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడి పర్యటనను ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి వర్సిటీలు పునఃప్రారంభం

కర్నూలు కల్చరల్: ఉమ్మడి జిల్లా పరిధిలోని రాయలసీమ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. గత నెల 26వ తేదీ నుంచి వర్సిటీలకు దసరా సెలవులు ప్రకటించారు. సెలవుల అనంతరం వర్సిటీలు తిరిగి ప్రారంభమై యథా విధిగా పీజీ తరగతులు మొదలు కానున్నాయి.

డ్యూటీల విషయంలో పక్షపాత వైఖరి తగదు

కర్నూలు సిటీ: కర్నూలు–2 డిపోలో డ్రైవర్లకు, కండక్టర్లకు డ్యూటీలు వేసే విషయంలో చార్ట్ వద్ద యూనియన్ పక్షపాత వైఖరి చూపిస్తోందని, ఇందుకు నిరసనగా ఆదివారం డిపో ఎదుట ఏపీ ప్రజా రవాణా శాఖ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ డిపో కార్యదర్శి జి.మహేశ్వర రావు మాట్లాడుతూ.. చార్ట్ కౌన్సెలింగ్ జరిగి చాలా కాలం అయ్యిందని, కావున వెంటనే చార్ట్ కౌన్సిలింగ్ జరపాలన్నారు. చార్ట్ వద్ద కొంత మంది ఏడీసీలు సిబ్బందిని దరుసుగా మాట్లాడుతూ సిబ్బందిని ఇబ్బంది పెట్టడం మానుకోవాలన్నారు. కర్నూలు వయా గుడూరు ఎమ్మిగనూరు వెళ్ళే మార్గంలో రోడ్డు సక్రమంగా లేకపోవడంతో డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వహించేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి రోజు అర్ధరాత్రి అవుతుందని, దీని వల్ల ఉద్యోగులు అనారోగ్యం భారీన పడుతున్నారన్నారు. డబుల్ డ్యూటీలు చేస్తేనే సెలవులు ఇస్తామనే విధానాన్ని మానుకోవాలన్నారు. వయస్సు మళ్లిన వారు అనారోగ్యంగా ఉండేవారు డబుల్ డ్యూటీ చేయలేరని, వారికి పొజిషన్ చూసి వారికి లీవ్‌లు మంజూరు చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలు చేస్తామన్నారు. డిపో–2 మేనేజర్ చొరవ తీసుకొని డ్రైవర్లు, కండక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డిపో మేనేజర్ తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలేష్, కె.వై రాముడు, గోపాల్, ఫక్రుద్దీన్, కృష్ణయ్య, పి.జె రెడ్డి, జ్యోతి, రాములమ్మ, రామలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు ఆటవిడుపు



పోటీలో పాల్గొన్న వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): నిత్యం రోగులను పలకరిస్తూ వారి యోగక్షేమాలు కనుక్కుంటూ వారికి సరైన వైద్యం అందిస్తూ బిజీగా ఉండే వైద్యులకు ఆటవిడుపు లభించింది. ప్రతి ఆదివారం క్రికెట్ ఆడేందుకు నిర్ణయించుకుని వారు పలు జట్లుగా ఏర్పడ్డారు. ఈ మేరకు స్థానిక నందికొట్కూరు రోడ్డులో డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ఉదయం ప్రారంభమయ్యాయి. పోటీలను సీనియర్ కంటి వైద్యులు పి.సుధాకర్‌రావు ప్రారంభించారు. ఈ లీగ్‌లో వైద్యులు కేఎంసీ అలుమ్ని, ఆర్థోపెడిక్స్ బ్లాస్టర్స్, కర్నూలు డెంటల్ స్ట్రైకర్స్, పీడియాట్రిక్ పాంథర్స్ జట్టుగా ఏర్పడి పోటీలో పాల్గొన్నారు. మొదటి మ్యాచ్ కేఎంసీ అలుమ్ని, కర్నూలు డెంటల్ స్ట్రైకర్స్ జట్ల మధ్య ఉత్కంఠభరితంగా సాగింది. ఇందులో కేఎంసీ అలుమ్ని జట్టు 18 పరుగులతో తేడాతో కర్నూలు డెంటల్ స్ట్రైకర్స్‌పై విజయం సాధించింది. లీగ్‌లోని మ్యాచ్‌లు ప్రతి ఆదివారం నిర్వహించనున్నారు. గ్రాండ్ ఫైనల్ నవంబర్ 16వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సుధాకర్‌రావు మాట్లాడుతూ.. డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ వైద్య వృత్తిదారుల మధ్య స్నేహబంధం, ఆరోగ్యం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించే అద్భుత వేదికగా నిలుస్తుందని చెప్పారు. వైద్యులు క్రీడలతో మానసిక ప్రశాంతతను పొందడం ఎంతో అవసరమని చెప్పారు.

కమిషనర్‌పై ఫిర్యాదుకు నిర్ణయం

కర్నూలు (టౌన్): బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌లోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం, సచివాలయాల ఉద్యోగులను ఇష్టానుసారంగా మాట్లాడటం, షోకాజ్ నోటీసులు ఇవ్వడం, మెమోలు ఇవ్వడం, సస్పెన్షన్ చేయడం, ఉద్యోగులను భయాభ్రాంతులకు గురిచేస్తున్న నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్‌పై మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులందరూ తిరుగుబాటు చేస్తున్నారు. శనివారం నగరపాలక రెవెన్యూ విభాగంలో పనిచేసే ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి అబ్దుల్ వాజిద్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే గాకుండా తోటి ఉద్యోగుల ఎదుట గెటౌట్, ఇక్కడి నుండి వెళ్లిపో.. లేకుంటే సస్పెండ్ చేస్తా.. అంటూ సీరియస్ కావడంతో సదరు అధికారి కుటుంబ సభ్యులతో కలిసి పెట్రోలు పోసుకొని తగలబెట్టుకుంటానని ఆందోళన చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే అప్పటికే కమిషనర్ వ్యవహార శైలిపై అన్ని విభాగాలకు చెందిన ద్వితీయ శ్రేణి అధికారులు, ఉద్యోగులు, సచివాలయాల ఉద్యోగులు అందరూ కలిసి ఏకపక్షంగా కమిషనర్‌పై ఫిర్యాదు చేసేందుకు ఆదివారం చర్చించారు. మున్సిపల్ సుపీరియర్ ఉద్యోగుల సమక్షంలో ఫిర్యాదు చేసేందుకు నిర్ణయించారు.

డీఎంఈ, మంత్రి, ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేసేందుకు నిర్ణయం

ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తున్నా మున్సిపల్ ఉద్యోగులు, సెక్షన్ హెడ్‌లను వేధిస్తున్న కమిషనర్‌పై చివరికి ఫిర్యాదు చేసేందుకు నిర్ణయించారు. మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులకు సోమవారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అలాగే మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని మున్సిపాలిటీ అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులు కలిసి ఫిర్యాదు చేయనున్నారు. వేధించడమే పనిగా పెట్టుకున్న కమిషనర్‌ను కట్టడి చేయాలని ఫిర్యాదుల్లో పేర్కొననున్నారు. చెప్పిన పని చేస్తున్నాం. టార్గెట్ పెడుతున్నారు. ఒక్కరోజులో పని చేయాలంటూ ఇబ్బందులు పెడుతున్నారు. అయినా పనిచేస్తున్నాం. ఇదేంటి తిట్టడం, బెదిరించడం అంటూ మున్సిపల్ ఉద్యోగులు వాపోతున్నారు. ఇక తాడో పేడో తేల్చుకునేందుకు రంగం సిద్ధమైంది. 20 ఏళ్లకు పైగా ఎంతో మంది మున్సిపల్ కమిషనర్లు, ఐఏఎస్ హోదాల్లో పనిచేసిన వారు ఉన్నారు. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే మూకుమ్మడిగా సెలవుల్లో వెళ్లేందుకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు.

పదేళ్లు కేసులు లేకుంటే రౌడీషీట్ ఎత్తివేత



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విక్రమసింహా

కర్నూలు (టౌన్): పది సంవత్సరాల పాటు ఎలాంటి కేసు నమోదు కాకుంటే రౌడీషీట్ ఎత్తేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని నాలుగవ పట్టణ సీఐ విక్రమసింహా అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాజీ నేరస్తుల పిల్లల చదువుల కోసం సంబంధిత యాజమాన్యాలతో మాట్లాడి ఫీజులు విషయంలో తగ్గించేలా కృషి చేస్తామన్నారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలు, వ్యక్తిగత సమస్యలుంటే పరిష్కరించే మార్గాలు చూపిస్తామన్నారు. నేరాల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తన కలిగి ఉన్న వారిపై పోలీసు అధికారుల సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. మంచి నడవడిక ఉన్న వారు ఎలాంటి సహాయం అడిగినా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తప్పు చేయాలనే ఆలోచన ఉన్న వారిపై నిరంతరం నిఘా ఉంటుందని హెచ్చరించారు.

ముగిసిన అటవీ శాఖ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్



వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులతో అటవీశాఖ అధికారులు

- రాష్ట్రస్థాయి పోటీలకు 30 మంది ఎంపిక

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ కర్నూలు సర్కిల్ ఉద్యోగుల రెండు రోజుల స్పోర్ట్స్ మీట్ ఆదివారం ముగిసింది. కర్నూలు సర్కిల్ (కర్నూలు, కడప, నంద్యాల డివిజన్) అటవీ శాఖ ఉద్యోగులు 52 మంది కర్నూలు అవుట్ డోర్ స్టేడియం, ఇండోర్ స్టేడియంలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. 30 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐఎఫ్ఎస్ వీబీఏ కృష్ణమూర్తి అన్నారు. కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన ముగింపు వేడుకల్లో కర్నూలు డివిజన్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయకుమార్, ఆదోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజశ్వని, ఏటలు అబ్దుల్ సుభాన్, మహమ్మద్ ఏసాన్ పాల్గొని క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి బహుమతులు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. డోన్ ఎఫ్ఆర్ఓ ప్రవీణ్‌కుమార్, ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఆర్ఓ శ్రీనివాసులు, ఎఫ్ఎస్ఓలు కిరణ్, మౌలాలి, సర్కిల్ కార్యాలయ ఉద్యోగులు ఆదిల్, రాణాప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఏరులుగా మద్యం



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం మద్యాన్ని ఏరులై పారిస్తూ మహిళల గోడు పట్టించుకోవడం లేదని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో కర్నూలు మండలం మహిళా సంఘం జనరల్ బాడీ సమావేశం మండల నాయకురాలు రేణుక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మద్యం ఏరులై పారుతోందన్నారు. మద్యానికి బానిసలైన మగవారు ఇళ్లలోని ఆడవాళ్లను హింసిస్తున్నారని, దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆదాయమే లక్ష్యంగా ప్రధాన రహదారులు, బడులు, గుడులు తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం అమ్ముతోందని విమర్శించారు. మరోవైపు ప్రతి గ్రామంలో టీడీపీ నాయకులు బెల్టు షాపులు ఏర్పాటు చేశారని, ప్రతి వైన్‌షాపులో సీటింగ్ అరెంజ్‌మెంట్ ఉండడంతో అక్కడే తాగుతూ తూలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగిన మైకంలో మహిళలపై దాడులు చేస్తున్నారని, కొన్ని చోట్లా హత్యాయత్నాలు చేస్తున్నారని, మరికొన్ని చోట్ల మహిళలను దారుణంగా హింసించి చంపేస్తున్నారని, అయినా కూటమి ప్రభుత్వం మహిళల గోడు పట్టించుకోకుండా ముందుకెళ్లడం అన్యాయమన్నారు. అనంతరం కర్నూలు మండల మహిళా సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రమీజాబీ, నాగేశ్వరమ్మను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలుగా పద్మ, భారతి, సహాయ కార్యదర్శులుగా శ్యామల, సాలమ్మతోపాటు మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దు



మాట్లాడుతున్న టి.రాముడు

కర్నూలు(సెంట్రల్): అక్టోబర్ 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షల పేరుతో చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, సీపీఎం న్యూసిటీ నగర కార్యదర్శి టి.రాముడు మునిసిపల్ అధికారులకు సూచించారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో ట్రాఫిక్‌కు సంబంధించి రెడ్, గ్రీన్, ఎల్లో జోన్‌లుగా విభజించి చిన్న వ్యాపారుల బంకులను తొలగించేందుకు చర్యలు తీసుంటున్నట్లు చెప్పారు. వై జంక్షన్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు, రాజ్‌విహార్ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు, గుత్తి పెట్రోల్ బంకు వరకు రెడ్ జోన్‌గా ప్రకటించి రోడ్డుపై ఉన్న బండ్లు, బంకులను తొలగించేందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. స్వశక్తితో బతుకున్న వారిని ఉన్నఫళంగా రోడ్డుపైకి లాగడం అన్యాయమన్నారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చిన్న వ్యాపారులను కంట్రోల్ చేయాలే తప్పా వారి జీవన భృతిపై కొట్టడం అన్యాయమన్నారు. మోదీ వస్తుంటే వ్యాపారులను ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. నాయకులు నరసింహులు, నగేష్, మహ్మద్‌గోపాల్ పాల్గొన్నారు.